# "పోరు తప్పదా!"

రోషన్ మామగార్ని ఆదివారం రాత్రి పదిగంటలకు ఇంటికి పిలిపించమని తండ్రికి చెప్పాడు. అప్పుడు అమెరికాలో అతనికి ఆదివారం పొద్దున తొమ్మిదిగంటలు. అప్పటికి నిద్రనుంచి లేవాలి! – శనివారం తొందరగానే పడుకున్నాడు. తండ్రి మామగార్ని గురించి చెప్పిందగ్గర్నుంచి అతనికి ఒళ్ళు మండిపోతున్నది. సంధ్య మీదా కోపంగా వున్నాడు. ఆమెతో మాట్లాడలేదు శనివారమంతా.

"ఏమో! సీరియస్‌గా వున్నాడు. ఆఫీసులోని పని ఎక్కువై అలసిపోయాడేమో!" అనుకొని ఏం అడుగలేదు సంధ్య. ఆమే అలసిపోయివుంది. మాట్లాడే ఓపిక లేదు.

వాళ్ళ పెండ్లయి ఆరునెల్లుకూడా కాలేదు. పెండ్లికని ఇండియా పోయి ఇద్దరూ మూడు వారాలు కూడా లేరు. ఇద్దరికీ సెలవు లేకపోవటంతో ఎక్కువ రోజులుండలేక పోయారు. సంధ్యకు స్కాలర్‌షిప్‌తో కొలరాడో విశ్వవిద్యాలయంలో ఎమ్ఎస్ చేయటానికి అడ్మిషన్ వచ్చినప్పట్నుంచి తల్లి ఆమె పెండ్లి చేసుకుంటేనే గాని అమెరికా పోవటానికి వీల్లేదని మొదలుపెట్టింది. ఇంతలో వీసా కూడా వచ్చింది. అయినా తల్లి కూతురు పెండ్లి! పెండ్లి! అని కలవరించటం వదలలేదు. పెండ్లి సంబంధాలు చూస్తుంటె పెళ్ళి కావలసిన మగపిల్లలంతా అమెరికాలోనే వున్నట్లనిపించింది! ఇప్పుడే ఇండియాకు వచ్చేవాళ్ళెవరూ కన్పించలేదు. అది పెండ్లిళ్ళ ముహూర్తాలు లేని కాలం! ఏం చేయలేక అమెరికాలో కొడుకులున్న తలిదండ్రుల అడ్రస్‌లు తెలుసుకొని వాళ్ళను కలిసి మాట్లాడాడు సంధ్య తండ్రి సురేశ్.

'మా అమ్మాయి పెండ్లి చేసుకునే అమెరికా పోవాలని మా ఇష్టమండి." అన్నాడు సురేశ్.

ఏదైన దారి చూడమన్నట్లుగా వేడుకున్నాడు. "ఇప్పుడే రమ్మనటం ఎట్లా వీలవుతుందండి. మీ అమ్మాయి ఫోటో ఇచ్చి పోండి అబ్బాయికి పంపిస్తాం. నచ్చితే చూద్దాం" అన్నారు.

సంధ్యను స్టూడియోకి తీసుకపోయి పెండ్లి చూపులకని ఫోటోలు తీయించింది తల్లి రమ. సంధ్య రోజు ఎట్లా వుంటుందో అట్లనే ఫోటో దిగుతానంటే రమ ఒప్పుకోలేదు. పట్టుచీర కట్టించింది. కొంచెం మేకప్పు వేయించింది. ఫోటోలు రెండు – ఒకటి క్లోజప్‌లో మరోటి నిలబడ్డ ఫోజులో తీయించింది. సురేష్ తీసుకుపోయి తలా రెండు రెండు ఫోటోలు ఇచ్చి వచ్చాడు. మ్యారేజ్ బ్యూరోల్లో రిజిస్ట్రేషన్ చేయించి అక్కడా ఫోటోలు ఇచ్చాడు. "వారం రోజుల్లో పెండ్లి సెటిల్ అయిపోతుందండి!" – అని భరోసా ఇచ్చారు మ్యారేజ్ బ్యూరో వాళ్ళు. ఓ వారం రోజులు చూసి మగపిల్లల తల్లిదండ్రులను కలిసాడు. ఇప్పుడే పెండ్లి గురించి ఆలోచించటం లేదంటున్నాడండి అన్నారు. మ్యారేజ్ బ్యూరో వాళ్ళు "ఇంత తొందరపడితే ఎట్లా?"– అన్నారు విసుగ్గా. ఆ మాట రిజిస్ట్రేషన్ డబ్బు తీసుకుంటున్నప్పుడు అనలేదు. ఇంతలో ఎవరో వార్త అందించారు – అమెరికాలో వున్న కొడుకు కోసం పిల్లను చూస్తున్నారు తల్లిదండ్రులని. సురేశ్ ఆలస్యం చేయకుండా పోయి వాళ్ళను కలిసాడు.

"మీకెవరు చెప్పారండి మా గురించి?..." అనుమానంగా ముఖంపెట్టి అడిగాడు పిల్లగాని తండ్రి. సురేశ్ చెప్పాడు.

"హో! వాళ్ళు చెప్పారా!... సరే! మీరేం చేస్తుంటారు?" అడిగాడు సురేశ్‌ను పరిశీలనగా కిందికి మీదికి చూస్తూ.

సురేశ్ చెప్పాడు.

"హో! మీరు ఆఫీసరేమో అనుకున్నాను.

"మీది సొంత ఇల్లేనా?–" మళ్ళా అడిగాడు ఈసారి అంతగా మంచి జవాబు వస్తుందని అతడు అనుకోవటంలేదని అతని మొఖమే చెప్తున్నది. అతని మొఖం చూస్తేనే సురేశ్‌కు అక్కడ్నుంచి పారిపోవాలనిపించింది. కాని పోలేకపోయాడు. సురేశ్ చెప్పాడు.

"వందగజాల్లో ఇల్లు కట్టుకున్నారా! అందులో ఒక పోర్షన్ కిరాయి క్కూడా ఇచ్చారా! బాగుంది. ఫోటో ఇచ్చి వెళ్ళండి. అబ్బాయిని కనుక్కుంటాం" అన్నాడు. సురేశ్ ఫోటోలు ఇచ్చి కదిలాడు. మళ్ళా పోయి కనుక్కొనే ధైర్యం లేకపోయింది. "ఎందుకు కనుక్కోవటం లేదండి?" రమ నిలదీసి అడిగిందతన్ని. సురేశ్ ముక్కు ముడిచాడు. "ముక్కులు మూతులు విరిస్తే సంబంధం కుదరదండి. ఆడపిల్ల వాళ్ళం నాలుగుసార్లు తిరగాలె. అది అవమానమనుకుంటె ఎట్ల? పెండ్లిచూపులని ఎంతమంది వచ్చి నన్ను చూడలేదు! మా అమ్మ వచ్చిన వాళ్ళకు ఫలహారాలు చేసిచేసి విసిగిపోయింది – ఎందరో చూసింతర్వాత మీరు వచ్చి సరేనన్నారు. మరి ఆడపిల్ల అన్న తర్వాత గడపలెక్కాలె దిగాలె!" అంది రాధ తన ఆరాటాన్నంతా భర్త మీద చూపిస్తూ. సంధ్య అక్కడే వుంది. తల్లిమాటలు వింది.

"ఏందమ్మా! ఆడపిల్లను కని అంత లోకువ కావాలా? నాన్నా! నేను చదువు కున్నాను. అమెరికాకు పోతున్నాను. మగవాళ్ళతో సమానంగా అక్కడ ఉద్యోగం చేస్తాను. అయినా మీరు నా పెండ్లి విషయంలో ఇంతగా చింత పెట్టుకోవటం సంబంధాలు చూస్తూ తిరగటం నాకేం నచ్చలేదు." తీవ్రంగా వుంది సంధ్య గొంతు.

"సంధ్యా! నీకేం తెలియదు ఊరుకో. నువ్విట్లా మాట్లాడితే నీకు పెండ్లి అయినట్లే!" అంటూ రమ సంధ్య నోరు మూయించింది. సంధ్య కండ్లల్లో నీళ్ళు నిండాయి.

"నా కూతురనేది నిజమేనే. అది ఇంజనీరింగు చదివింది. సొంత ప్రతిభతో స్కాలర్‌షిప్ తెచ్చుకొని అమెరికా పోతున్నది. రేపు ఉద్యోగం చేస్తుందక్కడ. ముక్కు మొఖం రంగు దేనిలో తీసిపోకుంట వుంది. దానికేం తక్కువని నేనీ అవమానాలన్నీ భరించాలె!" కోపంగానే సురేశ్ గొంతు లేచింది.

"మీకూ ఒక్క కొడుకున్నాడు కద అమెరికాలో. వాడి పెండ్లప్పుడు మీ దర్జాదర్పం చూపిద్దురుగాని! ఇప్పుడు కాదు." రమ కోపంగా లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

సురేశ్ కోపంగా వున్నా తెల్లవారి భార్య వచ్చి – "పెండ్లి మేళా జరుగుతూందట. కుల సంఘం వాళ్ళు పెట్టారట. అక్కడేమైన సంబంధం కుదిరితే సంధ్య పొయ్యేలోపల పెండ్లి చేద్దాం" అంది. సురేశ్ ఆశగా భార్య వెంట బయల్దేరాడు. కక్కు ఎప్పుడు వస్తుందో, కళ్యాణమెప్పుడు వస్తుందో చెప్పలేము – అని సామెతను తల్చుకొని నిట్టూర్చాడు సురేశ్. "కొడుకు తో సమానంగా కూతుర్ని చదివించినా కొడుకు అమెరికా పోయినప్పుడు లేని అభద్రతాభావన అతనికి కూతురు పోతుందంటె కలుగుతూవుంది. ఛ్!... ఆదర్శాలన్నీ ఆచరణలోకి వచ్చేసరికి ఎక్కడికో ఎగిరిపోతాయి. సమాజం ముందు తలవంచవల్సి వస్తుంది. ఈ ఘర్షణనుంచి బయటపడాలంటె పెద్ద 'కలేజా' నే కావాలె! –" నిట్టూర్చాడు సురేశ్.

పెండ్లి మేళా జరిగే హాలుకు వాళ్ళు పదకొండున్నరకు చేరుకున్నారు. అంత తొందరగా ఎవరైనా వుంటారో లేదో అని జంకుతూనే లోపలికి ప్రవేశించారు. హాలు ఆడ, మగ పిల్లలు పెద్దలతో కిక్కిరిసి వుంది. అక్కడక్కడ టేబిళ్ళు కుర్చీలు వేసారు. మీరు చాలా లేటు అన్నట్లుగా ఏ టేబిల్ దగ్గరా జాగా కన్పించలేదు. జనం కిటకిటలాడుతున్నారు. మెల్లగా ఒక టేబిల్ దగ్గరకిపోయి ఆగారు. అక్కడెవరూ వాళ్ళవైపు చూపులు కూడా తిప్పి చూడలేదు. మాట్లాడుకోవటంలో మునిగి వున్నారు. టేబిల్ చుట్టూ కుర్చీల్లో ఆడ, మగ జంటలు జంటలుగా కూర్చొని వున్నారు. ఎక్కువమంది ఆడపిల్లలతో... అంటె పెండ్లికూతుళ్ళతో వచ్చిన వాళ్ళే కన్పించారు. అదేమంటె!– ఆడపిల్లల జనాభా తగ్గిపోతుందని పేపర్లు రాస్తున్నాయి. ఇక్కడేమో అంతా పెండ్లి కావల్సిన వాళ్ళు ఆడపిల్లలే కన్పిస్తున్నారు! సురేశ్‌కు అదంతా చూసి మనస్సులో చిరాకేసింది. "పద! ముందుకు పోదాం. ఇక్కడ ఖాళీ జాగానే లేదు." అన్నాడు విసుగ్గా.

"ఇగో! మీరిట్ల చిర్రుబుర్రులాడుతుంటె మరీ గుమాస్తాగానో చప్రాసీలాగీనో కన్పిస్తారు. చిరునవ్వుతో గంభీరంగా నడవండి!" రమ హెచ్చరిస్తూ ముందుకు సంధ్యతో కదిలింది.

ఇట్ల సంబంధాల వేటలో పడవలసి వస్తూందని ఎప్పుడూ సురేశ్ ఊహించలేదు. తనకొక్కతే కూతురు! ఇంజనీరింగు చదివింది. అందం తెలివి అన్నీ వున్నాయి దానికి. మగపిల్లవాండ్లే దాన్ని చేసుకుంటామని వెంబడిపడ్తారనుకున్నాడు. "నా కూతురుకు పెండ్లి సంబంధాలు వెతికే అవసరమే వుండదు!" అని చిరంజీవి స్టైల్లో కాలర్ వెనక్కు విసిరేసి ఛాతివిరిచిన సురేష్ ఇప్పుడు కూతురు పెండ్లి ఈ రెండు మూడు వారాల్లో కావాలని ఆదుర్దాలో పడ్డాడు.

ప్రతి టేబిల్ దగ్గర అడ్డబొట్టో నిలువుబొట్టో పెట్టుకున్న అయ్యవార్లు కాగితాల కట్టలను మల్లేస్తున్నారు తీరిక లేకుండా! సురేశ్ మెల్లగా ఓ టేబిల్ దగ్గరికి పోయి నిలబడ్డాడు. అయ్యగారు ఇద్దరి జాతకాలు చూస్తున్నాడు. జాతకాలు సరిపోవటం లేదని అంటున్నాడు. పెండ్లి కొడుకు తల్లిదండ్రులు విసురుగా అక్కడ్నుంచి లేచారు. మరో ఇద్దరు వచ్చి కూర్చున్నారు. లేచిపోతున్న వాళ్ళ వెంట పోదామా?– అనుకున్నాడు సురేశ్. "కాని తను సంధ్య జాతకం తేలేదే!– అయినా దాని జాతకమే రాయించలేదు జాతకాల్లో నమ్మకం లేక. జాతకం లేకపోతె పెండ్లి సంబంధం కుదరదా? ఏంది?" సురేశ్ విచారంలో తేలిపోతున్నాడు.

వెనుకనే నిల్చొని వున్న సంధ్య "నాన్నా!–" అని పిల్చింది. "నాన్నా! జాతకాల్లో నమ్మకం లేదు కద మనకు. ఏమాలోచిస్తున్నారు." అంది. రమ "పదండి ముందుకు!" అని తొందరపెట్టింది. సురేశ్ సంధ్య వైపు చూసి "ఆ బట్టల్లో సంధ్య ఎంత ముద్దుగా వుంది! మొఖంలో కళ కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నది!" రమ బలవంతం మీదనే సంధ్య ఆ మాత్రం తయారైంది. "అయినా ఆ మాత్రం కళగా లేకపోతే ఎట్లా!" మురిపెంగా అనుకున్నాడు సురేశ్. మరో టేబిల్ దగ్గర ఆగారు. అక్కడ కులం ఉప కులం గురించి చర్చలు సాగుతున్నాయి. సురేశ్ రమ సంధ్యలను తోస్తూ ముందుకు నడిపాడు.

"పిల్ల లక్షణంగా వుండాలండి. కట్నం మాకేం ఒద్దు..." అన్న మాటలు వినిపించి సురేశ్ ఆశగా ఓ టేబిల్ దగ్గర ఆగాడు.

"పెండ్లి మాత్రం ఘనంగా చేయాలండి. తండ్రి మంచి ఆఫీసరు జాబ్‌లో వుండి మంచి కుటుంబం సంప్రదాయం వున్న వాళ్ళు కావాలండి!" అంది అదేగొంతు. ఆ మాటలు విని సురేశ్ నిట్టూర్చాడు.

అక్కడంతా మగపిల్లవాండ్ల డిమాండులే విన్పిస్తున్నాయి. ఆడపిల్లల వాళ్ళు ఏ డిమాండ్లు పెట్టినట్లు లేదు. పైగా "మా పిల్ల ఇంజనీరింగు... ఎమ్‌సిఏ – ఎమ్‌బిఏ" – అని తమ వస్తువునమ్ముకునే వాళ్ళు వస్తు నాణ్యతను చెప్పుకున్నట్లుగా చెప్పుకుంటున్నారు. ఇంకా విచిత్రమేమిటంటే తమ వస్తువు నమ్ముకోవటంలేదు! ఎదుటి వస్తువును డబ్బు పోసి కొనుక్కుంటున్నారు! ఇక్కడ అమ్మకం చేసేవాళ్ళే కొనుగోలుదార్లను ఆడిస్తున్నారు. డాక్టర్లయితే కోట్లు, ఇంజనీయర్లయితే లక్షలు... అమెరికాలో వుంటె లక్షలకోట్లు... ఇట్లా నడుస్తూ వుంది మార్కెట్ రేటు!

లక్షల కోట్ల వ్యవహారం చూసి సురేశ్ గుండె దడదడలాడింది.

మాకు ఎమ్‌బిఏ అమ్మాయి వద్దండి. ఎమ్‌సిఏ నో కంప్యూటర్ ఇంజనీరింగో అమ్మాయి కావాలె. అణుకువగా వుండి సంసారపక్షంగా వున్న అమ్మాయి అయితే బాగుంటుంది. అమెరికా పోయిం తర్వాత విడాకులు అనే అమ్మాయిలు ఎక్కువైపోయారు. అందుకే మాకు లక్షణమైన ఆచార సంప్రదాయ కుటుంబం అమ్మాయి నెమ్మదిగా వుండి మనమాట వినేది కావాలె... అంటుందో గొంతు టేబిల్ దగ్గర. ఆమె ముందల అమ్మాయిల ఫోటోలు కుప్పలుగా పరచి వున్నాయి.

మేళా అంతా తిరిగినా సురేశ్‌కు ఎక్కడా కూర్చోవాలని అనిపించలేదు.

"పోదామే!–" అన్నాడు బరువుగా భార్యతో.

"అదేంది! ఇంతదూరం వచ్చి ఎవర్నీ ఏమి అడుగకుంటనే పోదామంటారేంది." రమ విసుక్కుంది.

"అవునమ్మా! నాక్కూడా ఏం నచ్చలేదిక్కడ పోదాం" సంధ్య బయటికి నడిచింది.

ఇంటికి వచ్చిం తర్వాత రుసరుసలాడింది రమ. సంధ్య అమెరికా పోయేది రెండు వారాలే వుంది. టికెట్ కూడా కొనేసింది. "పెండ్లి సంబంధమే ఇంక కుదరలేదు. పెండ్లి ఎట్ల అయితుంది!" – ఇదే చింత రమకు. "అమ్మా! నువ్వు ఇట్ల తొందరపడితే ఎట్ల! బీపి ఎక్కువైతది!" అని సంధ్య తల్లికి నచ్చజెప్పింది. అన్నట్లే రమ బీపి పెరిగింది. డాక్టరుకు చూపిస్తే పూర్తిగా విశ్రాంతిగా వుండాలని చెప్పాడు. తల్లి పక్కమీద వుండగానే సంధ్య అమెరికా వెళ్ళిపోయింది.

అమ్మాయి అమెరికాలో వుంది అంటె సంబంధాలు వస్తాయనుకుంటె ఒక్క సంబంధం రాలేదు. చూస్తుండగానే సంధ్య ఎమ్ఎస్ అయిపోయి ఉద్యోగంలో చేరింది. గ్రీన్ కార్డు అప్లై చేయకముందు ఒకసారి వచ్చి తలిదండ్రులను చూసిపోయింది. తండ్రి సంధ్య వచ్చినప్పుడు సంబంధాలు చూసాడు. ఆరాటంగా తిరిగాడు. అయినా లాభం లేకుండా పోయింది. చదువు కుదిరితే వయసు కలవలేదు. వయస్సు కుదిరితే చదువు సరిపోలేదు. అట్లా అన్నీ కుదిరితే అబ్బాయి అమెరికాలో వున్నాడు. ఇప్పుడే రాడు అని మాటలు!

సంధ్య అమెరికా వెళ్ళిపోయిం తర్వాత కూడా సురేశ్ సంబంధాల అన్వేషణ ఆపలేదు. ఆఖరికి రోషన్ గురించి ఎవరో బంధువు చెప్పాడు. వెంటనే సురేష్ పోయి అతని తలిదండ్రులను్ను కలిసాడు. అమ్మాయి గురించి చెప్పాడు. అంతా విని రోషన్ తండ్రి రంగారావు అమ్మాయి ఫోటో ఇయ్యండి చూద్దాం అన్నాడు. మళ్ళీ అదే పాట!

బరువుగా సురేశ్ జేబులోంచి సంధ్య రెండు ఫోటోలు తీసి ఇచ్చాడు. నాలుగు రోజులకు పోయి కలిసాడు. "ఇట్ల తొందరపడితే ఎట్లనండి! ఇంకా వారం రోజులకు రండి" – అన్నాడు ఇంటర్నెట్ ఈ మెయిల్ కాలంలో కూడా ఫోటోలు పంపటానికి ఇంత ఆలస్యమా! – మగపిల్ల వాళ్ళకెప్పుడు తొందర వుండదు. ఎప్పుడు ఆడపిల్ల వాళ్ళకే తొందరెందుకు! – సురేశ్ మనస్సులో నొచ్చుకున్నాడు. రోజులు లెక్కపెడ్తూ వున్నాడు. ఇంకోవైపు రమ "ఇంకా పోవటం లేదేంది. మీకేం చింత లేదు" అని పొడుస్తూనే వుంది. అయినా వారం రోజులు లెక్క పెట్టుకొనే పోయి రావును కలిసాడు సురేశ్.

"అమ్మాయి అమెరికాలో వుందన్నారు. ఒక్కతె వుంటుందా?" రావు గొంతులో ఏదో అనుమానం ధ్వనించింది.

"లేదండి. ఫ్రెండ్స్‌తో కలిసి వుంటుంది. వంట అదీ వాళ్ళే కలిసి చేసుకుంటారు."

"మీరు అమ్మాయి ఫోను నెంబరు ఇయ్యండి. మా అబ్బాయి మాట్లాడ్తాడట. అమ్మాయి అమెరికాలోనే వున్నదంటె వీసా గొడవలుండవని అంటున్నాడు."

సురేశ్ సంధ్య ఫోను నెంబరు రాసిచ్చాడు. "ఓ పదిహేను రోజులకు వచ్చి కలవండి" అన్నాడు రావు. మళ్ళా లెక్కపెట్టుకొని సరిగ్గా సురేశ్ పదిహేను రోజులకు పోయి రావును కలిసాడు. ఇంతలో సంధ్య ఫోను చేసి చెప్పింది రోషన్ ఫోను చేసాడని. ఉద్యోగం

ఏమిటి ఎంతిస్తారని గ్రీన్‌కార్డు ఎప్పుడు వస్తుందని అడిగాడట. "మాటలను బట్టి బాగానే అనిపించాడు" అంది సంధ్య. దాంతో సురేశ్‌కు ధైర్యం వచ్చింది. ఆశగానే పోయి రావు ముందు కూర్చున్నాడు.

రావు సురేశ్‌ను చూసి చిరునవ్వు నవ్వాడు. సురేశ్ సొంత ఊరు బంధువులు ఉద్యోగం గురించి అడిగాడు. సురేశ్ చెప్పింది వింటే రావుకు అంతగా సంతృప్తి కలిగినట్లుగా లేదు. మూతి బిగించాడు. కాస్సేపాగి. "మా వాడికి బాగానే కట్నం ఇస్తామని సంబంధాలు వస్తున్నాయండి! కాని మీ అమ్మాయి అమెరికాలో వుంది గ్రీన్‌కార్డు రాబోతుందని సరే అంటున్నాడు..." సురేశ్ ఊపిరి బిగపెట్టాడు ఇంకా రావు ఏమంటాడో అని.

"సరే!... మీరు నలుగురు బంధువులతో రండి కట్నం గురించి మాట్లాడుకుందాం" అన్నాడు.

సురేశ్ తన మేనమామ బావమరిది తమ్ముణ్ని వెంట తీసుకొని రావును కలిసాడు.

"ఊఁ... చెప్పండి? ఎంతలో దూగుతారు మీరు!" సూటిగానే రావు విషయంలోకి దిగాడు. ముక్కుసూటిగానే అడుగుతున్నాడు బాగానే వుంది! - అనుకున్నాడు సురేశ్.

"మేం రెండు లక్షల క్యాష్ ఇస్తాం. బట్టలు బంగారం అమ్మాయికి మీరే పెట్టుకోవాలె" అన్నాడు సురేశ్.

రావు మొఖం ఎర్రబడింది.

"మేం అంత తక్కువగా కన్పిస్తున్నామా? - మీకు" రావు కోపంగానే అన్నాడు.

సురేశ్ వాళ్ళను గురించి కనుక్కున్నాడు. అమెరికా పోయిం తర్వాతనే కొడుకు బంజారాహిల్స్‌లో ఫ్లాటుకొని ఇచ్చాడని ఇప్పుడు రావు వుండే ఫ్లాటు అదే అట! రావు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ డబ్బు వస్తే దాంతో కొడుకు అమెరికా పోకముందే కూతురు పెండ్లి చేసాడట. కూతురు అల్లుడు ఇప్పుడు అమెరికాలోనే వున్నారు. తన పరిస్థితికన్నా వాళ్ళేం మెరుగ్గా లేరు? అంతస్తులో తనంతటివాళ్ళే? ఇప్పుడు కొడుకు పంపే డబ్బుతో కారు డ్రైవరును మెయింటెయిన్ చేస్తున్నారు. అదే వాళ్ళ అదనపు క్వాలిఫికేషన్! రావు అవమానాన్ని దిగమింగుకొన్నాడు. "పది లక్షలు క్యాష్ ఇయ్యండి. అమ్మాయి నగలు బట్టలు మీ బాధ్యత. పెండ్లి ఖర్చు మీరు పెట్టుకోవాలె. మీకు తెలుసు గద పెండ్లి బాగా చేయాలె!" స్పష్టంగా చెప్పేసాడు. అట్లా అయితేనే ఈ సంబంధం కుదురుతుందని అన్నట్లుగా.

సురేశ్ రావు మాటలు విని షాకయ్యాడు. లేవబోయాడు. బావమరిది అతన్ని ఆపాడు. "రావుగారూ! అమ్మాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నది. అమ్మాయి మీది కాబోతున్నది. మరీ పట్టింపులకు దిగకండి." అన్నాడు నెమ్మదిగా.

రావు కొడుకును పెంచినట్లుగానే తను కూతుర్ని పెంచాడు. చదివించాడు. ఇప్పుడు సంపాదిస్తున్నది. అయినా ఆడపిల్ల తండ్రినయినందుకు ఈ కష్టాలు! అందుకేనేమో ఇంకా సమాజంలో ఆడపిల్లల్ని కనటం భారంగానే భావిస్తున్నారు!

"అమ్మాయి ఉద్యోగం చేస్తున్నదంటె మనకేమిటండి. వాళ్ళు వాళ్ళ భవిష్యత్తు బాగుంటుంది. సుఖపడ్తారు. కట్నం అంత ఇచ్చుకోగలుగుతేనే ముందుకు పోదాం. ముహూర్తాలు పెట్టుకుందాం!" అన్నాడు రావు ఇంకా ఏమి ఈ విషయంలో బేరసారాలు లేవన్నట్లుగా.

బావమరిది సురేశ్ వైపు చూసి ఏమి సైగ చేసాడో తెలియదు అతడు నిశ్శబ్దంగా నిట్టూర్పు విడిచి "సరే?–" అన్నాడు.

సంబంధం కుదిరిందని రమ సంతోషానికి అవధుల్లేవు. "అబ్బ! అమ్మాయి ఒక్కతె అమెరికాలో వుందని నా పరేషానీ! ఆడవాళ్ళ బాధలు మీకేం తెలుస్తాయి!" అంది రమ.

"అమెరికాలో మన అమ్మాయిలాగా ఎందరో వున్నారు – ఏం భయంలేదు. ఇండియాలో కన్నా సురక్షితంగా వున్నాననీ అమ్మాయి చెప్పలేదా! అయినా నీ పరేషానీ నీదే. నువ్వు పరేషాన్ అవుతావు ఎదుటి వాళ్ళను పరేషాన్ చేస్తావు! ఇప్పుడు కట్నం ఖర్చులకని ఇరవై లక్షలన్నా కావాలె! ఎక్కడ్నుంచి తెస్తాం!" కోపంగా అన్నాడు సురేశ్.

"సరే! అబ్బాయి అమెరికాలో వున్నాడు. కూతురు అమెరికాలో వుంది. అంత మాత్రం ఖర్చు చేయకపోతే ఎట్లండి! అమెరికానుంచి తెల్లవాళ్ళే వచ్చి ఇక్కడ పెండ్లి చేసుకుంటున్నారు సంప్రదాయంగా వుంటుందని. ఇక మనమూ ఆ మాత్రం గొప్పగా సంప్రదాయంగా పెండ్లి చేయకపోతే ఎట్లా!" అంది రమ. సురేశ్ బాధను ఆమె పట్టించుకొనే స్థితిలో లేదు. సురేశ్ మౌనంగా నిలబడిపోయాడు.

"సరే కాని. రోషన్ – అదే అబ్బాయి బాగున్నాడండి. అందంగా స్మార్ట్‌గా వున్నాడు.' అంది రమ. చేతిలో వున్న ఫోటోను భర్తకు చూపిస్తూ. "అమ్మాయికి తగిన సంబంధం! గొప్ప సంబంధం చేసామని నలుగురు అనుకుంటారు చూడండి!" రమ గొంతులో గర్వం ధ్వనించింది.

"అమ్మాయి జాతకం అడిగారు వాళ్ళు. పుట్టినరోజు సమయం చెప్పి అయ్యగారితో ఓ జాతకం రాయించు వాళ్ళకిస్తాను. ముహూర్తాలు పెట్టుకోవటానికి జాతకాలు కావాలట!" అన్నాడు సురేశ్.

"జాతకాలు చూసి ఏమంటారో?" – సురేశ్‌కు భయంగానే వుంది. కాని జాతకాల దగ్గర ఏం పట్టింపులు రాలేదు. పెండ్లి ముహూర్తం పెట్టుకున్నారు. పెండ్లి వారం రోజులుందనంగ పెండ్లి కొడుకు పెండ్లి కూతురు వచ్చారు. అంతవరకు ఇంటర్‌నెట్‌లో ఫోటోలు చూసుకోవటం మాట్లాడుకోవటమే జరిగింది. ఇప్పుడు ప్రత్యక్షంగా చూసుకొని మాట్లాడుకున్నారు.

సురేశ్ మేనమామ వాళ్ళిద్దర్ని ఒక్క దగ్గర చూసి ఆశ్చర్యపోయాడు. పెండ్లికాబోయే వాళ్ళ మొఖాల మీద కన్పించే సిగ్గు లేదు. సిగ్గులతో ఒలికే సింగారం లేదు. కండ్లల్లో తళుకు బెళుకు ల్లేవు. ఒకర్నొకరు చూడాలి తాకాలి అనే తహతహల్లేవు. సాదాసీదా ఆఫీసుల్లో కలిసి పనిచేసే ఉద్యోగుల్లా మాట్లాడుకోవటం అతనికి విచిత్రంగా కన్పించింది. "ఏమో! అమెరికాలో ఇట్లానే వుంటుందేమో!– అయినా వీళ్ళిద్దరూ ఇక్కడ పెరిగి చదువుకొని అక్కడికి పోయిన వాళ్ళేగద!– అక్కడికి పోయినంక అక్కడి పోకడలు అలవాటు అయ్యాయేమో!–" ఆలోచనల్లో మునిగిపోయాడు.

"కొత్త పెళ్ళి కూతురు పెండ్లి కొడుకులను చూసిన సంబరమే లేదు!–" అతనికి నిరాశ అనిపించింది.

తండ్రిలాగే రోషన్ నిక్కచ్చిగా మాట్లాడ్తాడు. నాన్చటం లేనేలేదు. ప్రేమ ఆర్ద్రతలు ఆప్యాయతలు అసలే లేవు. ఏది మాట్లాడినా ప్రయోజనం చూసి జోకి జోకి ఆచితూచి

మాట్లాడాడు. పొల్లు మాటనేది వుండదు. పెండ్లి ఘనంగా జరిగింది. పెండ్లి హాలు లైటింగు బ్యాండులకే లక్ష అయింది. పెండ్లి పందిరిని దిగుమతి చేసుకున్న ఆర్కిడ్ పూలతో అలంకరించారు. దానికో లక్ష! పెండ్లి కాంగనే వాళ్ళంతా అక్కడ వుండగానే అందమైన ఖరీదైన ఆ పెండ్లి పందిరిని ఊడపీకి వెంటనే జరిగే మరో పెండ్లికి మరో పందిరి వేయటం చూసి సురేశ్ గుండె పిండినట్లయింది. లక్ష రూపాయలు నీళ్ళలో పోసినట్లనిపించింది.

భోజనం క్యాటరింగుకిచ్చారు. మూడువేల మందికి ప్లేటుకు వంద చొప్పున మూడు లక్షలయింది. అమ్మాయి నగలు బట్టలు ఎక్కువ కొనుక్కోను అంది కాబట్టి రెండు లక్షల్లో అయిపోయింది. అంతా పెండ్లి ఖర్చు కట్నంతో ఇరవై లక్షల్లోకి చేరుకుంది. రిటైర్మెంటుతో వచ్చిన డబ్బు పీఎఫ్ వగైరాలు తన దగ్గరున్న పది లక్షలు పోగా పది లక్షలు అప్పయ్యాయి. ఇల్లు తాకట్టు పెట్టి స్నేహితులనడిగి వడ్డీకి తెచ్చి ఎట్లాగో అట్లాగ ఆ పదిలక్షలు సర్దాడు. ఇంత జరిగినా రావు రావు భార్య సంతోషంగా కన్పించలేదు. మూతులు ముడుచుకొని అదిలేదు ఇదిలేదు అని వంకలు పెడ్తూనే వున్నారు.

ఇదంతా చూసిన సురేశ్ కొడుకు సందీప్ "నేనయితే కట్నం లేకుండానే పెండ్లి చేసుకుంటాను. ఏమిటి నాన్న! ఆడపిల్లవాళ్ళను పీడించి పిండి పిప్పి చేసి ఏమిటీ పెండ్లి. ఈ పెండ్లిలో ఆనందమే లేదు. టెన్షన్ తప్ప. నేనయితే ఈ పద్ధతిలో చేసుకోనే చేసుకోను పెండ్లి!" అని ప్రకటించాడు.

"వాడి పెండ్లయితే వచ్చే కట్నంతో కొంత అప్పయినా తీరుతుందని ఆశపడ్తుంటె వీడేమో ఇట్లా మాట్లాడుతున్నాడు. అయినా తన ఆదర్శమూ అదే! మరి ఈ సంప్రదాయం కట్నం అనే సంబంధంలో ఎట్లా చిక్కుకపోయాడో తెలియదు! అయినా మాట్లాడిన ఆదర్శాలకు దగ్గట్టుగా ఎవరు ఆచరణలో అచ్చంగా నిలుస్తారు!–" సురేశ్ ఆలోచనల్లో పడిపోయాడు.

పెండ్లిలో రోషన్ ఆనందంగా కన్పించలేదు. అతడేమన్నాడోయేమో సంధ్య టెన్షన్‌తోనే కన్పించింది. "ఇద్దరి మొఖాల్లో పెండ్లి కళ లేదు!–" అనుకున్నాడు సురేశ్.

"ఇంత ఘనంగా చేసిన పెండ్లి ఖర్చంతా దండుగే గద! గంట పెండ్లికి ఏందీ ఖర్చు!" సందీప్ గంభీరంగా అన్నాడు.

"పెండ్లి ఖర్చు దండుగేందిరా!–" అంది రమ కొడుకును చూసి కోపంగా. "జీవితంలో ఒక్కసారి జరిగే పెండ్లి! ఇంతన్నా జరగకపోతే ఎట్ల! అయినా దండుగేముంది. ఎంతమందికీ పెండ్లితో వ్యాపారమవుతుందో చూసావుగద! కొంతమందికైనా జీవనోపాధి దొరుకుతున్నది!" రమ మాటలు విని సురేశ్ శుష్కంగా నవ్వాడు.

"అమ్మా! నీ అర్థశాస్త్రం లెక్కలు బాగున్నాయమ్మా!–" చిరునవ్వు నవ్వాడు సందీప్.

పెండ్లయిం తర్వాత రోషన్ సంధ్యలు ఓ వారం రోజులుండి సెలవు లేదంటూ అమెరికా వెళ్ళిపోయారు. వెళ్ళిపోయేముందు సంధ్య తండ్రి దగ్గరికి వచ్చింది – "నాన్నా! నీ రిటైర్మెంటు బెనిఫిట్స్ అంతా కలిపి ఓ పదిలక్షలుంటాయని నువ్వు చెప్పినట్లు గుర్తు. ఇంత డబ్బు కట్నం ఇచ్చి నా పెండ్లి చేయవలసిన అవసరమేంది నాన్నా! సరే! మస్తు

అప్పు అయింది. నేను నెలకు ఐదొందల డాలర్లు పంపుతాను. అన్నయ్య ఐదొందలు పంపుతానన్నాడు నాతో. నెలనెలా పంపే ఆ డబ్బుతో అప్పు తీర్చండి నాన్నా!–" అంది తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకొని సంధ్య. దాని చల్లని స్పర్శ తన తల్లి స్పర్శలాగా భద్రతనిచ్చినట్లనిపించిందతనికి.

"తల్లీ! సంధ్యా!–" బొంగురు గొంతులో మొఖం పక్కకు తిప్పుకున్నాడు. వర్షించే కండ్లను కూతురు చూడకూడదనుకున్నాడు.

"రోషన్ సంతోషంగా వున్నాడా అమ్మా!–" అడిగాడు సురేశ్ కన్నీళ్ళనాపుకొని కూతురువైపు చూసి.

"రోషన్ సంతోషంగా వుండక ఏమైంది నాన్నా! బాగానే వున్నాడు." పొడిపొడిగా అంది సంధ్య.

"నాన్నా! అమ్మా!– అప్పు తీర్చండి. అప్పు తొందరగా తీర్చి సంతోషంగా హాయిగా వుండండి. ఏ టెన్షన్లు పెట్టుకోవద్దు" అంది సంధ్య తల్లిదండ్రులవైపు చూస్తూ.

అమెరికా పోంగనే సంధ్య తండ్రి అకౌంటులో ఐదొందల డాలర్లు జమచేసింది. ప్రతి నెల ఆ విధంగానే ఆ అకౌంటులో ఐదొందల డాలర్లు ట్రాన్స్‌ఫర్ చేయమని తన బ్యాంకు వాళ్ళకి చెప్పింది. సంధ్య తండ్రికి డబ్బు పంపిస్తున్న సంగతి రోషన్‌కు తెలిసింది. అదీ తండ్రి ఇండియానుంచి ఫోనుచేసి చెప్తే తెలిసింది. అది తెలియగానే రోషన్ మొఖం నల్లబడింది. కండ్లు ఎరుపెక్కాయి. విసురుగా పోయి సంధ్య ముందు నిలబడ్డాడు.

"అందుకే అన్నాన్నేను మనిద్దరికి జాయింట్ అకౌంటు వుండాలని. ఇటువంటి దానధర్మాలు నేను సహించను!" కోపంగా వుందతని గొంతు.

"దానధర్మాలేంది! నా తలిదండ్రులకు డబ్బు పంపటం దానధర్మమా! నన్ను పెంచి చదివించిన తల్లిదండ్రులకు నా సంపాదనలో అంత మాత్రం ఇచ్చే హక్కు నాకు లేదా? అయినా నా పెండ్లికి నాన్న పది లక్షలు అప్పు చేసాడు. అది ఎవరు తీరుస్తారు!" గట్టిగానే ప్రశ్నించింది సంధ్య.

"అప్పెవరు చేయమన్నారు. నీ చదువుకయితే అప్పుకాలేదు కద! ఆడపిల్ల సంపాదనకు ఆశపడి అంతస్తుకు మించిన సంబంధమెందుకు చేయాలె?" అరిచాడు రోషన్.

"అంతస్తుకు మించిన సంబంధమా? – నీ అంతస్తు మా అంతస్తు కన్నా గొప్పదేం కాదు! అయినా నువ్వు మీ నాన్నకు పంపించే డబ్బు గురించి నేను నిన్ను ప్రశ్నించానా?– చెప్పు!–" కోపంగా గొంతు దించే అంది సంధ్య.

"నన్ను ప్రశ్నిస్తావా?– ఎంత ధైర్యం నీకు! అప్పుచేసి నీ వాళ్ళు ఈ పెండ్లి చేస్తున్నారంటే నేను 'నో' అనే వాడిని." కోపంగా అరిచాడు రోషన్.

"కూతురుకు మంచి సంబంధం చేయాలని తలిదండ్రులందరికీ వుంటుంది. అయినా నీతో సమానంగా ఇక్కడ యూఎస్‌లో వుండి సంపాదిస్తున్నాను గద – అంత కట్నం మీరెందుకడగాలి!"

"ఎంతకట్నం! బోడికట్నం తెచ్చావని ఎదురు మాట్లాడుతున్నావు! అది మీకు ఎక్కువేమో నాకు అంతకు వేయిరెట్లు ఎక్కువ కట్నం ఇస్తామని వచ్చారు. అయినా నేను

నిన్ను ఎంచుకున్నాను. అది నా కర్మ!" రోషన్ కోపం పట్టలేక డైనింగు టేబిల్ మీదున్న గ్లాసు తీసి గట్టిగా నేల మీదికి విసిరేసాడు. అది ఢన్‌మని చప్పుడు చేస్తూ ముక్కలైంది. సంధ్య విస్తుపోయింది. తేరుకొని - "నీ కర్మే కాదు. నా కర్మ కూడా! భార్య సంపాదననాశించే వాడివని ఎరుకలేక ఒప్పుకున్నాను." కోపంగా అరిచింది సంధ్య.

"ఏమన్నావ్!-" రోషన్ కోపంతో వేగంగా పోయి డైనింగు టేబిల్ మీదున్న పండ్లుకోసే చాకును అందుకొని సంధ్యమీది కురికాడు. సంధ్య భయపడిపోయింది. వెంటనే బలంగా అతని చేతి మణికట్టును గట్టిగా పట్టుకొని వెనక్కి తోసింది. తనకు అంతబలం ఎక్కడ్నుంచి వచ్చిందో ఆమెకే తెలియలేదు. రోషన్ వెనక్కు ఒరిగి కిందపడ్డాడు. చాకు చేతిలోంచి దూరంగా పడిపోయింది. అతని నుదురు సోఫా అంచును గుద్దుకుంది. "అబ్బా!" - అంటూ తలను పట్టుకున్నాడు. రక్తం కారుతున్నది. సంధ్యవెంటనే గ్లాసు పెంకులను జాగ్రత్తగా తప్పించుకుంటూ పడగ్గదిలోకి దూరింది. రోషన్ లేచాడు. తండ్రికి ఫోన్ చేసాడు. "నాన్నా! సురేశ్‌గార్ని రమ్మనండి కాన్ఫెరెన్స్ పెడ్దాం" అన్నాడు.

"ఏమైందిరా!-" రోషన్ గొంతు విని కంగారుపడ్డాడు రావు.

"ఏం కాలేదు. సంధ్య జాయింట్ అకౌంటు తీస్తుందా? లేదా? - తండ్రితోనే తేల్చుకుందాం" రోషన్ గొంతు కసిగా ధ్వనించింది. నుదుటి మీది రక్తాన్ని పేపర్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూ. సంధ్య పడగ్గదిలోనే వుండిపోయింది. రోషన్ అదనంగా వున్న పడగ్గదిలో పడుకున్నాడు. నొప్పికి మందుగోలీ మింగి తొందరగానే నిద్రపోయాడు.

రావు చెప్పినట్లుగానే సురేశ్ ఆదివారం రాత్రి వచ్చాడు. "రావుగారు! విషయమేంది? ఈ ఫోను మీద కాన్ఫరెన్స్ ఏమిటి?-" అడిగాడు కంగారుగా.

"ఫోను వస్తుంది కద విషయం తెలుస్తుంది. మీ అమ్మాయిని పెంచే విధం ఇదేనా? మాటకు మాట జవాబు చెప్తుంది. అమ్మాయి సంపాదనకు ఆశపడే మిమ్మల్ని ఏమనాలో అర్థం కావటం లేదు.." రావు అంటూనే వున్నాడు ఫోను మోగింది. రోషన్ నుంచే ఫోను.

"రోషన్ బాగున్నావా?-" అడిగాడు రావు.

"సురేశ్‌గారు వచ్చారు -" అన్నాడు. అక్కడ కూర్చున్న సురేష్‌కు రోషన్ మాటలు వినిపిస్తూనే వున్నాయి. ఈ గొడవంతా ఎందుకో సురేశ్‌కు చూచాయగా అర్థమైంది.

"రోషన్! మా అమ్మాయి నెలకు ఐదొందల డాలర్లు పంపుతానంది నేను వద్దనే అన్నాను... కాని అప్పు అయింది కద పిల్లలుగా మా బాధ్యత చేయనియ్యండని బలవంతం చేసింది. ఇదిగో ఈనెల పంపింది అంతే! వచ్చేనెలనుంచి వద్దని నేను చెప్తాను రోషన్!..." అన్నాడు సురేశ్ ప్రార్థిస్తున్నట్లుగా.

"మీరు వద్దన్నంక ఎందుకు పంపుతుందండి! పెండ్లికి ముందే మీరు చెప్పాల్సింది - మా అమ్మాయి సంపాదన మాది అని. అందుకే జాయింట్ అకౌంట్ తీయమంటె తీస్తలేదు. వెంటనే జాయింట్ అకౌంట్ తీస్తే సరే! లేకపోతే..." రోషన్ ముగించకముందే సురేశ్ అందుకున్నాడు."

"లేదు లేదు రోషన్! నేను అమ్మాయికి చెప్తాను..." నువ్వేమీ బాధపడకు..." సురేశ్ ముగించనేలేదు రావు అందుకున్నాడు.

"అయినా పెళ్ళయింతర్వాత అమ్మాయి మా ఇంటిదవుతుంది. అన్ని విధాల ఆమె మీద మా హక్కు వుంటుంది. ఇష్టం వచ్చినట్లుగ డబ్బును మందికి పంచటం ఎక్కడి సంప్రదాయమండి? కోట్లకొద్ది కట్నమిస్తామని మాకు సంబంధాలు వచ్చినా మా అబ్బాయి మీ అమ్మాయిని చేసుకుంటనన్నాడు. ఫోనుమీద మీ అమ్మాయి మా వాడి మీద ఏం మచ్చుమందు చల్లిందో! మేము వద్దన్నా వాడు అప్పుడు వినలేదు. ఇప్పుడు మీరు ఎటువంటివాళ్ళో వాడికి తెలుస్తున్నది. అనుభవిస్తున్నాడు!–"

"ఇదేంది మేం 'మంది' మి అయిపోయామా మా కూతురుకే! చదువు చెప్పించాం. వాళ్ళ కొడుక్కు వాళ్ళు చదువు చెప్పించినట్లుగా మేమూ చదువు చెప్పించాం. ఇప్పుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నది. పెండ్లికి అప్పు అయింది కదా అని డబ్బు పంపిస్తానంది. అక్కడికి నేను వద్దనే అన్నాను. ఆడపిల్ల సంపాదనకాశపడ్డానని ఈ విధంగా బద్నాం కావటం ఇష్టం లేకనే వద్దన్నాను..." సురేశ్ ఆలోచనలతో కండ్లల్లో నీళ్ళు నిండాయి. ఇంతలో ఫోనులో రోషన్ గొంతు కర్కశంగా విన్పించింది–

"నాన్నా! ఆ పెద్దమనిషి ఏం మాట్లాడడేమిటి? కూతురుకు నచ్చ జెప్తాడా లేదా ఇంతకు. అయినా ఇటువంటి అడుక్కు తినే సంబంధం చేసుకోవటం నాదే తప్పు! మీ మాటలు వినక కోట్ల కట్నాన్ని పోగొట్టుకొని..." ఈ మాటలన్నీ పడగ్గదిలో వున్న సంధ్య వింటూనే వుంది. చేతిలో సూటుకేసుతో బయటికి వచ్చింది.

"నేను పోతున్నాను. నా సంపాదనంతా నీ చేతుల్లో పోసి బానిస బతుకు బతకటం నాకిష్టం లేదు. అయినా అమెరికాలో వుండి సంపాదిస్తున్నా నీకు కట్నం మీది ఆశలు పోలేదు. సంతృప్తి లేని నీ వంటివాడితో నేనుండదల్చుకోలేదు. పోతున్నాను. మగవాళ్ళతో సమానంగా చదివి ఉద్యోగాలు చేస్తున్నా ఆడపిల్లలకు కట్నం బాధలు తప్పటం లేదు. ఎక్కడున్నా ఇండియన్ మగవాళ్ళు మారరు. కట్నం వేధింపులతో కాల్చి చంపుతారు. ఉరి బిగిస్తారు. మగవాళ్ళ డబ్బు దాహం కట్నం మీది ఆశలు చావనంతవరకు ఆడపిల్లలు పెండ్లి చేసుకోమని ఏకమై నిర్ణయం తీసుకోవాలె.

ఎన్ని వాదాలు వచ్చినా దీన్ని నిర్మూలించే శక్తి ఎవరికీ లేకుండా పోతున్నది. దాంతో మగవాళ్ళ అత్యాశలు పెరిగి పోతున్నాయి! ఎక్కడో అక్కడ ఈ కీలుకు వాత పెట్టాలె! ఆడపిల్లలకు తలిదండ్రుల ఆస్తిలో హక్కుఅంటు తలిదండ్రులు ఇచ్చినప్పుడు తీసుకోవాలె కాని పెండ్లినాడు కట్నం అంటూ వేదించటం దేనికి! ఇదిగో పోతున్నాను. ముందుగా పోలీసు కంప్లెయింట్ ఇస్తాను. ఆ తర్వాత కోర్టులో విడాకులు!... కొందరైనా ఈ విధంగా చేయందే మగవాళ్ళ దురాశలు అంతం కావు!..." సంధ్య గట్టిగా దృఢంగా అనే మాటలు ఫోనులో అందరికీ వినిపించాయి.

సురేశ్ దిగులుతో దిక్కులు చూసాడు. రావు కోపంతో మండిపడ్డాడు. రోషన్ దిగ్భ్రాంతుడైపోయాడు. సంధ్య సూటుకేసుతో గబగబ నడిచింది. ముందు తలుపు తీసుకొని గట్టిగా తోస్తూ బయటికి నడిచింది. కొంచెంసేపటికి కింద కారు వేగంగా దూసుక పోయిన చప్పుడు వినిపించింది. రోషన్ మొఖం కోపంతో ఎర్రబడింది.

"ఏమైందిరా రోషన్! ఏమైంది? నాయనా!... ఏమైందిరా?" అరిచాడు రావు.

"ఏమైందండి?–" మెల్లిగా అడిగాడు సురేశ్.

ఫోను ఆఫ్ అయింది. అంతటా నిశ్శబ్దం ఆవరించింది.